## క్లుప్తంగా

### జాబ్‌మేళా వాయిదా

కడప కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని మైదుకూరులో శుక్రవారం జరగాల్సిన జాబ్‌మేళాను అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు.

### పుష్పగిరి పీఠం భూముల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ పుష్పగిరి మఠానికి చెందిన ఆస్తుల వేలం గురువారం నిర్వహించినట్లు మఠం మేనేజర్ పి.గిరిధర్ తెలిపారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలోని పెద్దపప్పూరు గ్రామంలోని సర్వే నెంబరు 210లోగల విస్తీర్ణం ఏ7.10 సెంట్ల భూమిని గురువారం వేలం వేశామని ఆయన వివరించారు. ఉదయం స్థానిక జయనగర్ కాలనీలోని శ్రీ పుష్పగిరిమఠం మేనేజర్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, సి.సిద్దయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేలం పాట ద్వారా రూ. 2,22,000 గుత్త లభించినట్లు ఆయన వివరించారు. 2018 కన్నా ఈ ఏడాది ఎక్కువ మొత్తం లభించినట్లు ఆయన వివరించారు.

### శ్రీకృష్ణ దేవరాయల విగ్రహ ఏర్పాటు ప్రకటనపై హర్షం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో జరిగిన మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు గండికోట టూరిజంపై స్పెషల్ ఫోకస్‌లో భాగంగా శ్రీకృష్ణదేవరాయల వంద అడుగుల భారీ విగ్రహం ఏర్పాటుపై ప్రకటన చేయడాన్ని హర్షిస్తున్నామని జిల్లా బలిజ సంక్షేమ సంఘ నాయకులు తెలిపారు. గురువారం కడపలో రాయల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలు ఏలిన సీమ రాయలసీమలోగల గండికోటలో విగ్రహ ఏర్పాటు నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సగినాల శ్రీనివాసులు, కార్యదర్శి మాదరాసు రెడ్డయ్య, సింగారయ్య, బిల్డర్ శ్రీను, రామకృష్ణ, జయరాఘవ, లక్ష్మమయ్య, వరాలు, రెడ్డమ్మ, అమరావతి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

### ఘన సన్మానం



హరిబాబును సత్కరిస్తున్న మానవత సంస్థ సభ్యులు

కడప కల్చరల్ : మానవత సేవలకు సంబంధించిన ప్రచారంలో హరిబాబు కృషి చేస్తున్నారని మానవత సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలోని మానవత సంస్థ కార్యాలయంలో హరిబాబు గురించి వివరించారు. బాపట్లలో మానవత సంస్థ ఏర్పడేందుకు ఆయన కృషి ప్రధాన కారణమని వివరించారు. ఈ సందర్భంగా హరిబాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి, రాటాల గోపి, ఆత్మీయ సహకార కమిటీ సభ్యులు లేవాకు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**ఆర్థికసాయం..**

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు శ్రీనివాసరావుకు గురువారం రూ. 4000 ఆర్థికసాయం అందజేసినట్లు సంస్థ సెంట్రల్ కమిటీ సభ్యులు తెలిపారు.

### ఎంఆర్‌ఐ యంత్రాన్ని ప్రారంభించిన మంత్రి



ఎంఆర్‌ఐ యంత్రంగల గదిని ప్రారంభిస్తున్న మంత్రి ఫరూఖ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర పరిధిలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో అందుబాటులోకి తెచ్చిన ఎంఆర్‌ఐ, మెమోగ్రఫీ మిషన్లను గురువారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూఖ్, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీతో కూడిన యంత్రాలు అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, కళాశాల సెక్రటరీ ఏక్యూ జవ్వాద్, ఈడీ సల్మాన్ ముర్తజ, ప్రిన్సిపాల్ శైలరేఖ, వైస్ ప్రిన్సిపాల్ రామమనోహర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ నగేష్, హెచ్‌ఓడీ శ్యామ్‌సుందర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహానాడు చిత్రాలు



మహానాడు తర్వాత ప్రమాదకర ప్రయాణం



కడప నగరంలో బస్సులు లేక బస్టాండులో పడిగాపులు కాస్తున్న జనం



కడప నగరంలో ట్రాఫిక్ జామ్



సభకు హాజరైనవారు తాగుతూ ఇలా..

# బహిరంగ సభకు బస్సులు.. ప్రయాణికులకు తిప్పలు

బద్వేలు అర్బన్ : జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన బహిరంగ సభకు ఆ పార్టీ కార్యాకర్తలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను వినియోగించడంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బద్వేలు డిపో పరిధిలో దాదాపు 60 బస్సులు ఉండగా ఇందులో 35 బస్సులను మహానాడు కార్యక్రమానికి కేటాయించారు. దీంతో బద్వేలు డిపో నుండి వివిధ ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గట్టుపల్లె, ముత్తుకూరు, సీతారామపురం, పాయూరు, బి.మఠం, మైదుకూరు, కలువాయి తదితర ప్రాంతాలకు సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. అలాగే కడప, నెల్లూరులకు సైతం బస్సుల సంఖ్యను కుదించారు. వివిధ పనుల నిమిత్తం ఆయా ప్రాంతాలకు ప్రయాణం చేసేందుకు వచ్చిన ప్రజలు బస్సు అందుబాటులో లేక కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించగా మరికొందరు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. అందుబాటులో ఉన్న అరకొర బస్సులలో ప్రయాణించేందుకు ప్రజలు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ ఆయా గ్రామీణ ప్రాంతాలకు తిరిగే బస్సులు రద్దు కావడంతో ప్రజలు ప్రమాదకర స్థితిలో ఆటోలలో ప్రయాణం చేయక తప్పలేదు.



బస్సులు లేక బస్టాండులో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

### వైభవంగా అభయ ఆంజనేయ స్వామి వార్షికోత్సవం



కోలాట నృత్యం చేస్తున్న మహిళలు

చాపాడు: మండల పరిధిలోని రాజువారిపేట లో వెలసిన శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవస్థాన 16వ వార్షికోత్సవ వేడుకలను బుధ, గురువారాల్లో ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఓల్డ్ కేటగిరి ఎద్దుల బండ లాగుడు పోటీలు, మహిళల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకకు హాజరైన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

**ప్రథమ స్థానంలో ప్రొద్దుటూరు ఎద్దు**

రాజువారిపేటలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లెకు చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచాయి. రాజువారిపేటకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి ఎద్దు ద్వితీయ, అనంతపురం జిల్లా పెద్దపేరూరు మండలం వరదాయపల్లెకు చెందిన శ్రీరాములు ఎద్దు తృతీయ, మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లెకు చెందిన మూలే సూరారెడ్డి ఎద్దు నాల్గవ, కాశినాయన మండలం చిన్నాయపల్లెకు చెందిన గుర్రాల నారాయణరెడ్డి ఎద్దు ఐదవ, కడపకు చెందిన బొజ్జ విద్య ఓబుళరెడ్డి ఎద్ల ఆరవ స్థానంలో గెలుపొందాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు.

### గండికోటను అభివృద్ధి చేస్తాం



గండికోటలో ఆల్బమ్ పరిశీలిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

జమ్మలమడుగు : ఎంతోఘన చరిత్ర కలిగిన పర్యాటక కేంద్రం గండికోట. అలాంటి గండికోటను పర్యాటకంగా అన్నివిధాలుగా తీర్చిదిద్దడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిలతో కలిసి గండికోటను సందర్శించారు. పర్యాటకంగా గండికోటను తీర్చి దిద్దితే ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గండికోట అభివృద్ధికి రూ.78 కోట్లు కేటాయించింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### నేటి నుంచి తిరునాల

వల్లూరు : మండలంలోని పాపాఘ్నినగర్ (కట్ట బస్టాపు) వద్ద వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి తిరునాల శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఉదయం 10 గంటలకు తాళ భజన కార్యక్రమం జరుగుతుంది. 31న ఉదయం విశేష పూజలు జరుగుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు కోళాట ప్రదర్శన వుంటుంది. జూన్ 1వ తేదీన ఉదయం స్వామివారికి అభిషేకాలు, ఆకు పూజలు, విశేష పూజలు జరుగుతాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. 1 గంట నుండి కోళాట ప్రదర్శన జరుగుతుంది.

**బండలాగుడు పోటీలు**

ఉత్సవాల్లో భాగంగా 1వ తేదీ ఉదయం సేద్యపు ఎద్దులచే బండలాగుడు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30,116, ద్వితీయ బహుమతి రూ.20,116, మూడవ బహుమతి రూ.15,116, నాలుగవ బహుమతి రూ.10,116, ఐదవ బహుమతి రూ.3,116 నగదు బహుతులు అందజేయనున్నట్లు తెలిపారు.

# మూఢ నమ్మకాలపై అవగాహన కలిగిఉండాలి

కడప కల్చరల్ : సమాజంలో పాతుకుపోయి ఉన్న పలు మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని వైవీయూ అధ్యాపకులు సునీత తెలిపారు. జన విజ్ఞాన వేదిక వేసవి వినోదం కార్యక్రమంలో శిక్షణా శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ బాబాలు, దొంగస్వాములు, భూత వైద్యులు తమవద్ద అదృష్ట శక్తులు, మహిమలు ఉన్నాయని ప్రజలను మోసం చేస్తున్న వారి గురించి వివరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు, ఇంద్రజాలకులు సమీర్‌బాష మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు పెరిగినపుడే ఇలాంటి అడ్డుగోడలు ఉండవని, విద్యావంతులే స్వాముల మాయలో పడుతున్నారని, శాస్త్రీయ దృక్పథం పెరగకపోతే మూఢ నమ్మకాలకు బానిస అయ్యే ప్రమాదం ఉందని ఆయన వివరించారు. మ్యాజిక్ చాకచక్యంగా చేయవలసిన శాస్త్రీయ పరిజ్ఞానమని, మ్యాజిక్ అంటే హస్తలాఘవమని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన బియ్యంతో నిండిన చెంబులో కత్తి గుచ్చి బయటికి తీయడం తదితర ఆసక్తికరమైన అంశాలను ప్రదర్శించారు. దొంగ బాబాల పేరుతో నేటికీ అమాయక ప్రజలతో డబ్బులు గుంజుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో జెవీవీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, వైవీయూసూ గణిత అధ్యాపకులు సునీత, కామేశ్వరమ్మ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



మ్యాజిక్ ప్రదర్శన చేస్తున్న విద్యార్థి

# జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ఉక్కు పరిశ్రమ సెయిల్ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేయాలని రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక నేతలు అవ్వారు మల్లికార్జున, జే. వి. రమణ, డి. ఎం. ఓబులేసు యాదవ్, వై. ఎం .ప్రతాప్ రెడ్డి, వై మల్లయ్య లు డిమాండ్ చేశారు. గురువారం కడప ప్రకాష్ నగర్ లోని జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ కార్యాలయంలో రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కడప మహానాడులో త్వరలో ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తామని ప్రకటించడానికి స్వాగతిస్తున్నామన్నారు. అయితే గతంలో పలుమార్లు ఇలా శంకుస్థాపన చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రులు మారుతున్నా ఉక్కు ఫ్యాక్టరీ శంకుస్థాపనకు పరిమితమైందని రాయలసీమ ప్రజలు చాలా ఆవేదనతో ఉన్నారన్నారు. ప్రవేట్ పరిశ్రమ మాకొద్దు, ప్రభుత్వ రంగంలోనే పరిశ్రమను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా కార్పోరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజు దోపిడీని అరికట్టాలని, వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ విషయమై గురువారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌కు కడపలో విద్యార్థి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కార్యదర్శి జాల జయవర్ధన్, పి.ఎస్.యూ అధ్యక్ష కార్యదర్శులు సుబ్బరాయుడు, నరేంద్ర వై.ఎస్.ఆర్.యూ జిల్లా అధ్యక్షులు సాయి దత్త, పి.ఆర్.ఎస్.వై.ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్ర మాట్లాడారు. కడప జిల్లా వ్యాప్తంగా కార్పోరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడిని సాగిస్తున్నాయన్నారు. ఫీజులు నియంత్రణ చట్టం అమలుకు నోచుకోకపోవడం వల్ల ఇలా జరుగుతోందన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిషేధిత పేర్లతో ప్రచారం చేస్తూ, అక్రమ ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై ఉక్కు పాదం మోపి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలకు శ్రీకారం చుడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్, పి.ఎస్.యు జిల్లా కార్యదర్శి గోపి, వైయస్సార్.ఎస్.యూ నగర అధ్యక్షులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

**పక్కాగా అమలు చేయాలి**

కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను అరికట్టే విధంగా చట్టాన్ని పక్కగా అమలు చేయాలనీ ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర, సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గురువారం కడప నగరంలోని ఆర్ఎస్‌పీ కార్యాలయంలో పీఎస్సీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం కడపలో ఏర్పాటు చేసిన తెలుగు దేశం మహానాడులో విద్యారంగం, నిరుద్యోగ సమస్యలపై చర్చించక పోవడం అన్యాయం అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోపి కేశవ, నరసింహ, గౌతమ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ పరిష్కరించాకే సీనియారిటీ జాబితా విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల నేపథ్యంలో విద్యాశాఖ విడుదల చేసిన సీనియారిటీ జాబితాలలోని తప్పిదాలను సంపూర్ణంగా పరిష్కరించాకే బదిలీ సీనియారిటీ జాబితాలను విడుదల చేయాలని ఎస్టీయు ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల గంగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర రెడ్డిలు కోరారు. ఈ విషయమై గురువారం ఎస్టీయూ నాయకులు కడప గాంధీ నగర్ మున్సిపల్ హై స్కూల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులకు పదోన్నతులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న కడప జిల్లా డీఈఓ షేక్ షంషుద్దీన్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రాజగోపాల్ రెడ్డి, డీఈఓ కార్యాలయం ఏ.డి మునీర్‌ఖాన్‌లను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలలో అనేక అభ్యంతరాలు ఉన్నాయని వాటి పరిష్కారం కోసం ఉపాధ్యాయులు గ్రీవెన్స్ రైజ్ చేస్తారని వాటిని సంపూర్ణంగా పరిష్కరించిన తర్వాతే ఖచ్చితమైన సీనియారిటీ జాబితాలో విడుదల చేయాలని కోరారు. అలాగే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ విధానంలోనే బదిలీ ప్రక్రియ నిర్వహించాలన్నారు. అలాగే 2023 బదిలీల తర్వాత మళ్లీ నిర్బంధ బదిలీకి గురవుతున్న గ్రేడ్-2 పండితులకు అర్హత ఉన్నవారికి అన్ని రకాల స్పెషల్ పాయింట్లు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త అధ్యక్షులు సురేష్‌బాబు, జమ్మలమడుగు నాయకులు ప్రతాపరెడ్డి, అన్నమయ్య జిల్లా నాయకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

## నేటి నుంచి వేరుశనగ విత్తన నమోదు ప్రారంభం

వీరపునాయునిపల్లె: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో నేటి నుంచి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తన నమోదు ప్రక్రియ ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. గురువారం ఆయన తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలానికి 360 క్వింటాళ్ల విత్తన కాయలు మంజూరైనట్లు తెలిపారు. ఈ విత్తన కాయలను 40 శాతం రాయితీతో అందిస్తామన్నారు. కె6 మరియు టి.సి.జి.ఎస్ 1694 రకాలు అందుబాటులో ఉన్నాయని క్వింటాల్ పూర్తి ధర రూ.9300 ప్రభుత్వం రాయితీ రూ.3720లు, రైతు వాటా రూ.5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్ధ ఎకరా విస్తీర్ణం వరకు 30 కేజీల బ్యాగు ఒకటి, ఎకరా విస్తీర్ణం వరకు 30 కేజీల బ్యాగులు 2, ఎకరం లేదా అంతకన్నా ఎక్కువ విస్తీర్ణం గల రైతులకు 30 కేజీల బ్యాగులు మూడు మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. అవసరమైన రైతులు మీకు దగ్గరలోని రైతు సేవా కేంద్రాలకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, సెల్‌పోన్ తీసుకెళ్లి బయోమెట్రిక్ ద్వారా విత్తన కాయలు పొందాలన్నారు.

### గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న గిరిజన ఐక్య వేదిక నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : గిరిజన సామాజిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని గిరిజన ఐక్య వేదిక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సౌరకాయల శివ శంకర్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కడపకు వచ్చిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, గిరిజన తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలపై స్పెషల్ వెరిఫికేషన్ చేయించాలని, తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు పొంది ఉద్యోగాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని, జిల్లాల వారిగా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్లను ఏర్పాటు చేయాలని, గిరిజన కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. వీటితోపాటు ఇతర సమస్యలు పెండింగ్‌లో ఉన్న వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆయన మంత్రిని కోరారు.

### సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్ మేవా జిల్లా అధ్యక్షుడు జలీల్‌ఖాన్

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆల్‌మేవా రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ ఎస్ఏఎస్ ఫరూర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జలీల్‌ఖాన్, నజీర్‌బాషలు పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ఆల్ మేవా జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగులకు ఇవ్వవలసిన డీఏలు, 12వ వేతన సవరణతోపాటు ఐఆర్‌లను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే 2004 నవంబర్ 1వ తేదీ తరువాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలన్నారు. ఇప్పటికే 12వ వేతన సవరణ, డీఏలు, ఐఆర్‌ల కోసం ఉద్యోగులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. నేడు విజయవాడలో జరిగే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యలపై చర్చించాలన్నారు. ఈ సమావేశంలో ఆల్ మేవా జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఖాజా మొహిద్దీన్, సెక్రటరీ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో మరకత లింగేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానది తీరంలోని శ్రీఅమృతేశ్వరస్వామి ఆలయంలో గురువారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మరకత లింగేశ్వరుడికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తిపీఠాలకు, నవరత్న లింగాలకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, రక్షాబంధనం, ధ్వజారోహణ, కలశస్థాపన, అంకురార్పణ పూజా కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

### ఘనంగా మృత్యుంజయ హోమం



హోమంలో పూర్ణాహుతిని సమర్పిస్తున్న వేద పండితులు, భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామికి విశేష పూజలు చేశారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలను వేద పండితులు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామచంద్రాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

### సాయినాథుడికి పూజలు

వీరపునాయునిపల్లె : మండలంలోని వేంపల్లె, ఎర్రగుంట్ల ప్రధాన రహదారిలోని పాలగిరి క్రాస్ వద్ద వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రజలు భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మూల మూర్తిని అలంకరించారు. భక్తులు పూజలు నిర్వహించడంతో పాటు సాయి భజనలు నిర్వహించారు.